ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మర్పల్లి, మార్చి 17: ఆశ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ మునిరోద్దీన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.18 వేలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు నీలమ్మ, విజయలక్ష్మీ, పోచమ్మ, అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు

యాదవులు రాజకీయంగా ఎదగాలి

బొంరాస్‌పేట్, మార్చి17: అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో దుద్యాల గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ యాదవ్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్ యాదవ్ తెలిపారు. ప్రధానకార్యదర్శిగా మొగులయ్య,ఉపాధ్యక్షులుగా బుగ్గప్ప, మల్లయ్య, కోశాధికారిగా వెంకటయ్య, కార్యదర్శులు గా తిరుమలయ్య, అంజమ్మ, బాలమణి, గౌరవ అధ్యక్షుడిగా మల్లయ్య, సలహాదారుడుగా కాశప్పతోపాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యాదవులు రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు బస్వరాజ్, నర్సింహు లు, నర్సింహ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలంపాట..

బొంరాస్‌పేట్, మార్చి17 : బొంరాస్‌పేట్ మండలం దుప్‌చర్ల గ్రామశివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను శనివారం తహసీల్దార్ పద్మావతి సిబ్బందితో కలిసి సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక 15 ట్రాక్టర్లు ఉంటుందని, నేడు మంగళవారం ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇసుక కొనుగోలుపై ఆసక్తి ఉన్నవారు దుప్‌చర్ల గ్రామానికి వచ్చి వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న
మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య

కులకచర్ల, మార్చి 17 : ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని కులకచర్ల మార్కెట్ కమిటి చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, పీఏసీఎస్ కనకం మొగులయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన వారిని ఎంపిక చేసి ఇండ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, నాయకులు గోపాల్ నాయక్, జోగు వెంకటయ్యగౌడ్, మహేశ్, అనందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

మల్కాజిగిరి, మార్చి 17: భవనంపై నుంచి కార్మికుడు కిందపడి మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ వివరాల ప్రకారం.. వెంకటసాయినగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో ఉదయం నుంచి కార్మికులు పని చేస్తున్నారు. ప్రమాదవశాత్తు కార్మికుడు రాజు కిందపడగా అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ఎండిన పంట ..దిగాలుగా రైతన్న



నీరు లేక ఎండిపోయిన శివకుమార్‌కు చెందిన వరి పంట

పరిగి, మార్చి 17 : బోర్లలో నీరు తగ్గిపోయి వేసిన పంట కళ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత కొన్నేళ్లుగా ఇలాంటి పరిస్థితి చూడలేదని, ఒక్కసారిగా నీరు తగ్గిపో వడం, వెనువెంటనే పంటలకు నీరు సరిపోక ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు ఎండిపోతుండడంతో పెట్టుబడి సైతం చేతికి అందే పరిస్థితి లేదని వాపోతున్నారు. పరిగి మండల పరిధిలోని షోండేపూర్ తాండకు చెందిన నేనావత్ శివకు మార్‌కు తన పేరిట ఒక ఎకరం, తల్లి కేస్లీబాయి పేరిట ఒక ఎకరం 8 గుంటలు భూమి ఉంది. 2.8 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు. ఎకరా భూమి కరిగెటకు ఒకసారికి రూ.6వేలు, వరి నాటుకు సుమారు రూ.13వేలు, విత్తనాలు, ఎరువులు కలిపి మొత్తం రూ. 40 వేలకు పైగానే పెట్టుబడి పెట్టారు. గత పదిహేను రోజులుగా క్రమంగా బోరులో నీరు తగ్గిపోతూ వస్తుంది. తద్వారా కొంత కొంత నీటి మట్టం పడిపోవడంతో వరి పొలంకు సరిపడ నీరు లేక ఎకరం పూర్తిగా ఎండిపోయింది. మరొక నెల రోజులైతే పంట చేతికి వస్తుందని ఆశగా ఉన్న తరుణంలో ఒక్కసారిగా బోరులో నీరు తగ్గిపోయి ఎకరం విస్తీర్ణంలో పంట పూర్తిగా ఎండిపోవడంతోపాటు ప్రస్తుతం ఉన్న ఎకరం 8 గుంటల భూమిలోని వరి సైతం పూర్తిగా చేతికి వస్తుందా అంటే అనుమానంగానే ఉందని రైతు శివకుమార్ పేర్కొన్నారు. గత అయిదారు సంవత్సరాలలో ఎపుడు ఇలాంటి పరిస్థితి లేదని, ఈసారే బోర్లలో ఒక్కసారిగా నీరు తగ్గిపోయి పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఒకవైపు నీరు తగ్గుతుండడంతో పంట పూర్తిగా ఎండిపోతుండడం వల్ల పెట్టిన పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. చుట్టుపక్కల బోర్లలోను నీరు రోజురోజుకు తగ్గిపో తున్నాయని, ఎండిన పంటలో పశువులు మేపడం తప్ప ఏమి చేయ లేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ గుర్తింపు

కులకచర్ల, మార్చి 17 : ఉత్తమ ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీవో సోమలింగం, ఎంఈవో రాంచందర్ అన్నారు. సోమవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని చౌడాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న భాగ్యవతికి ఉద్యోగ విరమణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఉత్తమ సేవలు అందించడంతో పాటు కాంప్లెక్స్ పాఠశాలల స్థాయిలో మంచి పేరుతెచ్చుకున్న భాగ్యవతి సేవలు చాలా గొప్పవన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖవక్త, కవి భాస్కర్ యోగి హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు చర్యలు తీసుకోవాలి

కాల్వలను శుభ్రం చేయిస్తున్న ఎంపీవో భాస్కర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి సంతోశ్

కులకచర్ల, మార్చి 17: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కులకచర్ల ఎంపీవో భాస్కర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముజాహిద్ పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పారిశుధ్యం పనులు, నర్సరీ, డంపింగ్‌యార్డు, క్రిమిటోరియం, హరితహారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పనులను సక్రమంగా నిర్వహించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూడాలన్నారు. గ్రామంలో ప్రతి రోజు చెత్త నిర్వహణ చేయాలని, చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోశ్, ఫీల్డ్‌అసిస్టెంట్ అనంతయ్య పాల్గొన్నారు.

ఐఫోన్లు తరలిస్తున్న మహిళల అరెస్టు

ఐఫోన్లును చూపుతున్న శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్

శంషాబాద్ రూరల్, మార్చి 17: విదేశాల నుంచి అక్రమంగా ఐఫోన్లు తరలిస్తున్న ఐదుగురు మహిళలను అరెస్టు చేసినట్లు శంషాబాద్ డీసీపీ రాజేశ్ తెలిపారు. సోమవారం యూఏఈ నుంచి 6ఈ- 1496 నంబర్‌గల విమానంహైదరాబాద్(శంషాబాద్) ఎయిర్‌పోర్టుకు ఉదయం 7.30 నిమిషాలకు చేరుకుంది. విదేశాల నుంచి కొందరు మహిళలు అక్రమంగా ఫోన్లు తీసు కువస్తున్నట్లు పక్కా సమాచారంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు అవుట్‌పోస్టు సీఐ బాలరాజు సదరు మహిళలను అదుపులోకి తీసుకొని వారి బ్యాగులను తనిఖీ చేయగా వారి వద్ద 10 ఐఫోన్లు దొరికాయి. మహిళలు రిజ్వాన బేగం, సభాకన్నం,ఉమ్మర్‌బేగం, సుప్రియ కన్నం, లాసిఉన్నీసాలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శివసాగర్ చెరువు నీరు కలుషితం కాకుండా చూడాలి

శివసాగర్ చెరువులో కలిసిన డ్రైనేజీ నీరు

వికారాబాద్, మార్చి 17 : వికారాబాద్ పట్టణ ప్రజలకు శివసాగర్ చెరువు నీరే గతంలో దాహార్తిని తీర్చింది. మిషన్ భగీరథ నీరు రావడంతో శివసాగర్ చెరువు నీరు సరఫరాను నిలిపి వేశారు. మిషన్ భగీరథ నీరు రాక పోతే పట్టణ ప్రజలకు ఈ నీరే తాగు నీరు అవుతుంది. గత కొంత కాలంగా వికారాబాద్ పట్టణంలో కొత్రేపల్లి వార్డు నుంచి వచ్చే డ్రైనీజీ నీరు నేరుగా శివసాగర్ చెరువులో కలుస్తున్నది. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శివసాగర్ చెరువులోకి డ్రైనేజీ నీరు చేరడంతో తాగు నీరు కలుషితం అవుతుంది. ఈ నీటిని పట్టణ ప్రజలకు సరఫరా చేస్తే పలు రోగాల బారినపడే ప్రమాదం ఉంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెరువు నీరు కలిషితం కాకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గ్రూప్-3లో 208 ర్యాంకు

కులకచర్ల, మార్చి 17: ఇటీవల నిర్వ హించిన గ్రూప్-3 పరీక్షలో కులకచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రా మానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రవణ్‌కుమార్ 208 స్టేట్ ర్యాంకు సాధించాడు. శ్రవణ్ కుమార్ ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా సాతంరాయ్ పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యా యుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఉద్యోగాలకు ఎంపిక

బాపల్లి నర్సింహులు, రాజయ్య

బొంరాస్‌పేట్, మార్చి17 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన టీజీపీఎస్‌సీ ఫలితాలలో హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగాలకు మండలానికి చెందిన ఇద్దరు యువకులు ఎంపికయ్యారు. ఏర్పుమళ్ల గ్రామానికి చెందిన బాపల్లి దేవమ్మ రెండవ కుమారుడు నర్సింహులు, చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన పిచకుంట్ల బాలయ్య కుమారుడు రాజయ్యకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇద్దరు వ్యవసాయ కుటుంబాని చెందిన వారు కావడంతో వీరి ఎంపికపట్ల కుటుంబ సభ్యులు,స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

దోమ, మార్చి 17: పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటన దోమ పోలీసు స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి గ్రామానికి చెందిన దొబ్బలి మైబమ్మ (55) గతంలో తన కుమారుడు, ఓ కుమార్తె మృతి చెందడంతో అప్పటి నుంచి మానసిక వేదనతో బాధపడుతూ ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు.ఇదే క్రమంలోనే మైబమ్మ ఆదివారం ఉదయం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. మృతురాలి కూతురు నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఆనంద్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సమావేశంలో మాట్లాడుతున్న కులకచ్ల మార్కెట్ కమిటి చైర్మన్ బీఎస్ ఆంజనేయులు

కులకచర్ల, మార్చి 17 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసు కోవాలని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అధికారులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ఉండాలన్నారు. దీనికిగాను పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, గోపాల్‌నాయక్, అంజి లయ్యగౌడ్ పాల్గొన్నారు

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ



మర్పల్లి, మార్చి 17 : మండలంలోని కొత్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేసినట్లు అంబేద్కర్ యువజన సంఘం సభ్యుడు రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పాపయ్య, మాజీ సర్పంచ్ ప్రభాకర్, ఉప సర్పంచ్ రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఘనంగా మాడల్‌స్కూల్ వార్షికోత్సవం

బంట్వారం, మార్చి17: ప్రతి విద్యార్థి ఓ ఉన్నతమైన లక్ష్యంతో చదువుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో తెలంగాణ మాడల్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అథితిగా హాజరై మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, అలాంటి వాటికి తావివ్వకుండా చదువే లక్ష్యం సాగాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి.కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్ రావు, ప్రిన్సిపాల్ బూలే, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

దోమ,మార్చి 17 : సరదాకోసం స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన ఘటన దోమ పోలీసు స్టేషన్ పరిధిలోని గోన్యానాయక్ తండాలో చోటుచేసుకున్నది. మండల పరిధి లోని గోన్యానాయక్ తండాకు చెందిన నేనావత్ శంకర్, కవితల కుమారుడు నేనావత్ బాలాజీ (13) ఆదివారం మధ్యాహ్నం తన స్నేహితులతో కలిసి ఈతకు కాకవేణి చెరువులోకి వెళ్లి అందులో మునిగి మృతి చెందాడు.సదరు విద్యార్థి పరిగిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు.నిన్న స్కూల్‌కు సెలవు కావడంతో తండాకు చెందిన స్నేహితులతో కలిసి బాలాజీ ఈతకు వెళ్లాడు. చెరువులో ఈత కొడుతన్న క్రమంలో అకస్మాత్తుగా మునిగి పోయాడు.బాలాజీ మునిగిపోవడంతో భయభ్రాంతులకు గురైన స్నేహితులు చురువులో వెతికారు.ఆ తరువాత మిగిలిన స్నేహితులంతా కలిసి తండాకు తిరిగి వచ్చారు. బాలాజీ చెరువులో కనబడకుండా పోయిన విషయాన్ని స్నేహితులు బాలాజీ తల్లిదండ్రులకు చెప్ప కుండా దాచారు. స్నేహితులను ఎంత బతిమాలినా ఆచూకీ చెప్పలేదు.తమకు తెలియదని చెప్ప డంతో బాలాజీ తల్లిదండ్రులు దోమ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తండాకు చేరుకున్న పోలీసులు విచారించగా నిన్న అందరం కలిసి చెరువులో ఈతకు వెళ్లాం. ఈత కొడుతూ బాలాజీ కనబడకుండా పోయాడని పోలీసులకు తెలిపారు. ఆదివారం రాత్రి కావడంతో మృత దేహాన్ని వెతకకుండా నిలిపివేయగా సోవారం ఉదయం అదే కాకరవాణీ చెరువులో బాలాజీ శవమై కనిపించాడు. బాలాజీ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్‌కుమార్ తెలిపారు.

షటర్ తాళాలు పగలగొట్టి దొంగతనం

మన్సూరాబాద్, మార్చి 17: షటర్ తాళాలు పగలగొట్టి ఫర్నిచర్ షాప్ లోకి చొరబడ్డ గుర్తు తెలియని వ్యక్తులు రూ. 50 వేల నగదును అపహరించుకుపోయిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్, చింతలకుంట చెక్ పోస్ట్, సరస్వతి నగర్ కాలనీకి చెందిన చెర్క సాయికిరణ్ ఎల్బీనగర్ కామినేని నుంచి ఉప్పల్ వెళ్లే మార్గంలోని శివగంగా కాలనీ ప్రధాన రహదారిపై పది సంవత్సరాలుగా షిరిడి సాయి ఎంటర్ ప్రైజెస్ పేరుతో ఫర్నిచర్ షాప్ ను నడుపుతున్నాడు. ఈ నెల 16న రాత్రి షాపును మూసి వేసి ఇంటికి వెళ్లాడు . మరుసటి రోజు సోమవారం ఉదయం షాపు వద్దకు రాగా షటర్ కొద్దిగా తీసి ఉంది. వెళ్లి బీరువాను పరిశీలించాడు. గుర్తుతెలియని వ్యక్తులు షాపులోకి ప్రవేశించి బీరువా ను ఓపెన్ చేసి అందులోని నగదును అపహరించినట్లు గుర్తించాడు. బాధితుడు సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం కొనుగోలుకు వెళితే కారు చోరీ

ఖైరతాబాద్, మార్చి 17 : వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసేందుకు వెళితే పార్క్ చేసి ఉన్న కారును ఓ గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట లీలానగర్ కు చెందిన తోట ప్రసాద్ ఆదివారం రాత్రి తన ఎంజీ హెక్టార కారులో సికింద్రాబాద్‌లోని దక్కన్ క్లబ్ హోటల్‌కు వెళ్లాడు. డిన్నర్ పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణమయ్యాడు. ఇంటికి వెళ్తూ దారి మధ్యలో బేగంపేట హోటల్ గ్రీన్ పార్కు ఎదురుగా ఉన్న రిలాక్స్ సంధ్య వైన్స్ లో మద్యం కొనుగోలు కోసం కారును షాపు ఎదుట పార్క్ చేసి వెళ్లగా, గుర్తుతెలియని వ్యక్తి కారును తీసుకొని వెళ్లిపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి విషయంలో గొడవ ..కేసు

బంజారాహిల్స్, మార్చి 17 : ఫిలింనగర్ లో నివాసం ఉంటున్న బాపురాం శశి అనే వ్యక్తి ఓ టీవీ చానల్ లో విలేకరిగా పనిచేస్తున్నాడు. తనకు తెలిసిన ఓ యువతిని ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్ వెంటపడి ప్రేమ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. నీ విషయాన్ని యువతి శశి కి చెప్పింది. దీంతో శశి ఇటీవల శ్రీకాంత్ ను మందలించాడు. కక్ష పెంచుకున్న శ్రీకాంత్ ఈనెల రెండు తేదీన అపోలో ఆసుపత్రి వద్ద అడ్డుకొని దాడి చేశాడు. నా జోలికి వస్తే అంతు చూస్తానంటూ హెచ్చరికలు జారీ చేశాడు. గత నెల 24న శశి ఇంటి ముందు పార్కు చేసిన బైకును ధ్వంసం చేశారు. అది కూడా శ్రీకాంత్ చేసి ఉంటాడని అతడి వల్ల తనకు ప్రాణహాని ఉందంటూ బాధితుడు శశి కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడు శ్రీకాంత్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీ పూండ్ల వెంకురెడ్డి రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం, ముడిమ్యాల గ్రామం వద్ద గల సర్వే నెం. 305/AA/2/2లో ఎక.00-20 గుంటలు విస్తీర్ణపు వ్యవసాయ భూమి (సరిహద్దులు: ఉత్తరం: సహస్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ భూమి, దక్షిణం: విజయ్ భాస్కర్ రెడ్డి భూమి, తూర్పు: పి.జంగయ్య భూమి, పడమర: Ch. అంజమ్మ భూమి)ని దాని అసలు యజమాని, పట్టాదారులు మరియు స్వాధీనదారులు **చాకలి క్రిష్ణ తండ్రి వెంకటయ్య,** నివాసం: ఇం.నెం. 1-44/1, మల్కాపూర్ గ్రామం, చేవెళ్ల మండలం, రంగారెడ్డి జిల్లా వారి నుండి కొనుగోలు చేయాలని ఉద్దేశిస్తు న్నారు మరియు అమ్మకం ఒప్పందం కుదుర్చు కున్నారు మరియు అమ్మకం ప్రతిఫలంలో భాగంగా బయానాగా కొంత మొత్తాన్ని కూడా చెల్లించారు.
ఎవరేని వ్యక్తి లేదా వ్యక్తులు, కంపెనీలు, బ్యాంకులు, ఏవేని ఆర్థిక సంస్థలు, ఆర్గనైజేషన్లు ఏవైన తెలిపిన భూములకు సంబంధించి ఏదేని క్లెయిం, చార్జ్, హక్కు లేదా ప్రయోజనం మరియు అభ్యంతరం కలిగి ఉన్నచో ఈ నోటీస్ తేదీ నుండి **ఒక వారం** రోజుల్లోగా సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ చిరునామాలో నా కార్యాలయాన్ని సంప్రదించండి, లేనిచో నా క్లయింట్ అమ్మకం లావాదేవీతో ముందుకు సాగుతారు మరియు ఆతరువాత ఎలాంటి క్లెయింలు అనుమతించబడవు.

సం/- కె.పి. జగన్ రెడ్డి, అడ్వకేట్
ప్లాట్ నెం.354/ఎ, ఎమ్ఎల్ఎ కాలనీ,
రోడ్ నెం.12, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034,
సెల్ నెం.9440792689

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962